జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం | 18 | జులై | 2025 • పేజీలు : 6

## తెలంగాణ రాష్ట్ర గుమ్మం.. అద్భుతంగా తీర్చిదిద్దుతాం

- అశ్వారావుపేట అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- దొంతికుంట చెరువు రింగ్ బండ్ నిర్మించేందుకు ప్రణాళికలు...
- రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




**అశ్వారావుపేట, జూలై 17, ప్రజాజ్యోతి:** నూతనంగా మున్సిపాలిటీగా ఏర్పడిన, తెలంగాణ రాష్ట్ర గుమ్మంగా ఉన్న అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్ర అభివృద్ధికి అన్ని విధాలుగా అండగా ఉంటామని, అత్యద్భుతంగా తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని

మిగతా 2 లో...







- అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు
- పేదోడికి అండగా ప్రజాప్రభుత్వం
- సన్న వడ్లను ప్రోత్సహించింది ఇందిరమ్మ ప్రభుత్వమే
- ఇందిరమ్మ ఇండ్లు పొందిన ఆడబిడ్డల కళ్ళలో ఆనందం
- వడ్డి లేని రుణాల పునరుద్ధరణ
- ధాన్యం కొనుగోలు మహిళల ద్వారానే
- ప్రతి వ్యాపారంలో మహిళలను భాగస్వామ్యం చేస్తున్నాం - మహిళ సంఘాల సభ్యులకు శిక్షణ
- స్వయం సహాయక సంఘ సభ్యులకు రూ. 10 లక్షల భీమా:
- రాష్ట్ర మంత్రులు పొంగులేటి, సీతక్క

### మహిళల ఆర్థికాభివృద్ధికి..

## ప్రభుత్వ చేయూత

**ఇల్లందు, జులై 17, ప్రజాజ్యోతి:** మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో, నిజాయితితో పనిచేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర పంచాయతి రాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళ, స్త్రీ, శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సీతక్క లు స్పష్టం చేశారు. గురువారం ఇల్లందు జెకె కాలనీ బ్లాక్ డైమండ్ స్టేడియంలో జరిగిన ఇందిరా మహిళా శక్తి సంబురాలలో పాల్గొని వడ్డీ లేని రుణాల చెక్కులు, లోన్ భీమా, ప్రమాద భీమా చెక్కులు, రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. పేదోడికి అండగా ప్రజాప్రభుత్వం ఉంటుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం వరి పండిస్తే ఉరి వేసుకున్నట్లే అని మాట్లాడడం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం సన్న వడ్లను ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు పొందిన ఆడబిడ్డల కళ్ళలో ఆనందం చూస్తే సంతోషంగా ఉందన్నారు. చాలా సంతోషంగా ఉందని, కదం తొక్కి, పెద్ద ఎత్తున మహిళలు సంబురాలకు వచ్చారని, అందరి దీవెనలు, ఆశీస్సులతో ఇందిరమ్మ ప్రభుత్వం 18 నెలలు పూర్తి చేసు కుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఆరా కొరా మంచి పనులను కొనసాగిస్తూ,

మిగతా 2 లో...





## నేషనల్ జియోస్పేషియల్ ప్రాక్టీషనర్ అవార్డు

ఓపెన్ సోర్స్ జి ఐ ఎస్ కోహార్ట్ అవార్డు' రెండు అవార్డులు అందుకున్న భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి. పాటిల్





**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 17, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యంత్రాంగానికి ప్రతినిధిగా జిల్లా కలెక్టర్ శ్రీ జితేష్ వి. పాటిల్ గురువారం ఐఐటి బాంబేలో నిర్వహించిన 'ఓపెన్ సోర్స్ జి ఐ ఎస్ డే'లో 'నేషనల్ జియో స్పేషియల్ ప్రాక్టీషనర్ అవార్డు' ఓపెన్ సోర్స్ జిఐఎస్ కోహార్ట్ అవార్డు' లను అందుకున్నారు. ఈ అవార్డులను ఐ ఎస్ ఆర్ ఓ మాజీ చైర్మన్ శ్రీ ఎ.ఎస్. కిరణ్ కుమార్ ప్రదానం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రామీణ సమస్యల పరిష్కారం కోసం చొరవ తీసుకుని, జియోస్పేషియల్ టెక్నాలజీ నిపుణులతో కలిసి భారతదేశంలో నిర్వహించిన మొట్టమొదటి 'ఓపెన్ సోర్స్ జి ఐ ఎస్' నిర్వహణకు గాను, అదే విధంగా జిల్లాలోని వివిధ సమస్యలకు సంబంధించి

మిగతా 2 లో...

## సింగరేణి పీఆర్ఓకు జర్నలిజంలో డాక్టరేట్



- తెలంగాణ ఉద్యమం నేపథ్యంలో సామాజిక మాధ్యమాల పాత్రపై చేసిన విశ్లేషణకు గౌరవం
- రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా స్వీకరణ
- అభినందనలు తెలిపిన సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్

**కొత్తగూడెం ( సింగరేణి ) , జులై 17, ప్రజాజ్యోతి :** సింగరేణి హైదరాబాద్ కార్యాలయంలో ప్రజా సంబంధాల అధికారి (పీఆర్ఓ) గా పనిచేస్తున్న శ్రీరాముల శ్రీకాంత్ తాను సమర్పించిన పరిశోధన అధ్యయనానికి తెలంగాణ యూనివర్సిటీ నుండి డాక్టరేట్ అందుకున్నారు. బుధవారం నిజామాబాద్ లోని తెలంగాణ యూనివర్సిటీలో జరిగిన రెండో స్నాతకోత్సవంలో

మిగతా 2 లో...

## భద్రత, నాణ్యత ప్రమాణాలు పాటించండి

### - గౌతమ్ పోట్రు



**కొత్తగూడెం (సింగరేణి), జూలై 17, ప్రజాజ్యోతి:** సింగరేణియులు బొగ్గు తవ్వకాలలో భద్రత, నాణ్యత ప్రమాణాలతో కూడిన జాగ్రత్తలు తప్పనిసరి పాటించాలని సింగరేణి డైరెక్టర్ (పా) గౌతమ్ పోట్రు తెలిపారు. గురువారం కొత్తగూడెం ఏరియాలోని జెవిఆర్, కిష్టారం ఓ.సి, సి.హెచ్.పిని అయన సందర్శించారు. జేవిఆర్, కిష్టారం ఓసీ ఉపరితల గనుల వివరాలను మ్యాపుల అధికారులు అతనికి వివరించారు. అనంతరం డైరెక్టర్ (పా) ఓ.సి లను సందర్శించి వ్యూ పాయింట్ ద్వారా బొగ్గు ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించచారు. అక్కడ రోజు వారి జరుగుతున్న

మిగతా 2 లో...

## తెలంగాణ రాష్ట్ర గుమ్మం.. అద్భుతంగా తీర్చిదిద్దుతాం

(మొదటి పేజీ తరువాయి...)

రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం నియోజకవర్గ కేంద్రంలోని వివేకానంద కూడలి నుండి దొంతికుంట చెరువు వరకు స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఐటీడీఏ పీవో రాహుల్ తో కలిసి మార్నింగ్ వాక్ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి పలువురు ప్రజలను పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ అశ్వారావుపేట నియోజకవర్గం రెండు రాష్ట్రాలకు సరిహద్దుల్లో ఉందని ప్రజల ఆకాంక్షలు మేరకు మున్సిపాలిటీగా ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గ కేంద్రాన్ని మోడల్ గా తీర్చిదిద్దేందుకు రహదారుల సుందరీకరణ, సెంట్రల్ లైటింగ్ పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. దొంతికుంట చెరువు పరిసరాలను 8 మీటర్ల వెడల్పుతో రింగుబం నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసిన మంత్రి వాకింగ్ ట్రాకులు పచ్చదనం కలిగిన పార్కులు ఏర్పాటుచేసి ప్రజలకు విశ్రాంతి కేంద్రాలుగా అభివృద్ధి చేయాలన్నారు.

## సింగరేణి పీఆర్ఓకు జర్నలిజంలో డాక్టరేట్

(మొదటి పేజీ తరువాయి...)



తెలంగాణ రాష్ట్ర గవర్నర్, యూనివర్సిటీ ఛాన్సలర్ జిష్ణుదేవ్ వర్మ నుండి డాక్టరేట్ సర్టిఫికెట్ ను శ్రీరాముల శ్రీకాంత్ స్వీకరించారు. 'సాంఘిక, రాజకీయ ఉద్యమాల్లో సామాజిక మాధ్యమాల పాత్ర, తెలంగాణ ఉద్యమంపై కేసు స్టడీ' అనే అంశంపై తాను సమర్పించిన పరిశోధనాత్మక అధ్యయనానికి ఆయనకు ఈ డాక్టరేట్ ను బహూకరించారు. ఉవ్వెత్తున సాగిన తెలంగాణ మలిదశ ఉద్యమంలో యువత అగ్రభాగంలో నిలిచారు...దీనికి ఉద్యమ ఆకాంక్షను విస్తృతంగా జన బహుళ్యంలోకి తీసుకెళ్లడంలో, సామాన్యుల భావ వ్యక్తీకరణకు సోషల్ మీడియా దోహదపడింది. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఈ విధంగా సోషల్ మీడియా కీలక భూమిక పోషించింది అని వివరిస్తూ శ్రీకాంత్ తన పరిశోధన పత్రాన్ని సమర్పించారు. ఇప్పటి వరకు సింగరేణి ఉద్యోగుల్లో పీహెచ్డీ సాధించిన వారు అతి కొద్ది మంది మాత్రమే ఉన్నారు. ఈ నేపథ్యంలో ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తూ ఉన్నత చదువుల పట్ల జిజ్ఞాసతో సంస్థ ఉద్యోగి శ్రీకాంత్ పీహెచ్డీ సాధించటంపై సింగరేణి చైర్మన్ ఎన్. బలరామ్ తన అభినందనలు తెలిపారు. వృత్తి బాధ్యతలను నిర్వర్తిస్తూ ఉన్నత విద్యార్హతలు సాధించాలనుకునే వారికి ఇది ఒక ప్రేరణను ఇస్తుందన్నారు. తన పరిశోధన అనుభవంతో సింగరేణి ప్రజా సంబంధాల విభాగానికి కూడా మంచి పేరు తీసుకువస్తారని ఆకాంక్షించారు. అలాగే ఈడీ(కోల్ మూమెంట్) ఎస్.డి.ఎం సుభాని, జీఎం(మార్కెటింగ్) టి.శ్రీనివాస్, సింగరేణి భవన్ అధికారులు, ఉద్యోగులు తమ అభినందనలు తెలిపారు.

## భద్రత, నాణ్యత ప్రమాణాలు పాటించండి


(మొదటి పేజీ తరువాయి...)

బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓబి బ్లాస్టింగ్, లోడింగ్ పనులను జి.ఎం శాలెం రాజు ద్వారా అడిగి తెలుసుకున్నారు. బొగ్గు నాణ్యతను పరిశీలించి వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును సరఫరా చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని.. రోజు వారి లక్ష్యాలను అధికమించి రవాణాకు ఎటువంటి ఆటంకములు కలుగకుండా ముందస్తు జాగ్రతలీ పాటించాలన్నారు. ఉపరితల గనుల్లో ఉద్యోగులలు రక్షణ పరమైన జాగ్రత్తలతో బొగ్గు ఉత్పత్తి తీయాలని సూచించారు. సి.హెచ్.పి లోడింగ్ పాయింట్ ను సందర్శించి రైలు మార్గం ద్వారా జరుగుతున్న బొగ్గు రవాణా, సైలో బంకర్ నుండి దుమ్ము ధూళి వెలువడకుండా తీసుకుంటున్న జాగ్రత్తలను పరిశీలించారు. అనంతరం జేవిఆర్ ఓసి వ్యూ పాయింట్ వద్ద ప్లాంటేషన్ చేశారు. తదుపరిగా నూతనంగా అనుమతులు వచ్చిన వికే ఓ.సి ఉపరితల మైన్ ప్రాజెక్టు వివరాలను, వాటి యొక్క రికార్డులను పరిశీలించారు . ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జిఎం జి.వి. కోటి రెడ్డి, ఏరియా ఇంజనీర్ కే. సూర్యనారాయణ రాజు, ప్రాజెక్ట్ ఆఫీసర్లు జేవిఆర్ ఓసి ఎన్.వి.ఆర్ ప్రహ్లాద్, కిష్టారం ఓసి ఎం.వి. నరసింహారావు, జేవిఆర్ సి.హెచ్.పి డీజీఎం (ఈఅండ్ఎం) కె. సోమశేఖర్, డీజీఎం (పర్సనల్) జి.వి. మోహన్ రావు, డీజీఎం (ఐఈడి) ఎన్. యోహాన్, ఇతర విభాగాల అధిపతులు, అధికారులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థికాభివృద్ధికి.. ప్రభుత్వ చేయూత

(మొదటి పేజీ తరువాయి...)

ప్రజల కోరికలు తీరుస్తూ, ఆడబిడ్డలకు ఇచ్చిన హామీలను అమలుపరుస్తూ ముందుకు వెళుతున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మొదటి దశలో 44. 50 లక్షల ఇందిరమ్మ ఇండ్లు రూ. 22500 కోట్లతో మంజూరు చేశామని, ప్రతి ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్లు పొందిన ఆడబిడ్డల కళ్ళలో ఆనందం చూస్తుంటే కొందరు ఓర్వలేక పోతున్నారని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు నిధులు విడుదల చేస్తుందని, ఎక్కడా కూడా నిధుల సమస్య లేదన్నారు. కుల, మత, రాజకీయాలకతీతంగా అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. దేశంలో మరెక్కడా లేని విధంగా ఉగాది నుండి 93 లక్షల పేద కుటుంబాలకు రాష్ట్రంలో సన్న బియ్యాన్ని రేషన్ కార్డు ద్వారా సరఫరా చేస్తున్నామని, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందజేస్తున్నామని పేర్కొన్నారు. సంక్షేమ హాస్టళ్లలో చదివే విద్యార్థులకు 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్స్ చార్జీలను పెంచామని, మహిళల కోసం రాష్ట్రంలో ఎక్కడికి వెళ్ళిన ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని తెలిపారు. పేదవాడి ఆరోగ్యాన్ని కాపాడాలని, రాజీవ్ ఆరోగ్య శ్రీ లబ్దిని రూ. 10 లక్షలకు పెంచామన్నారు. గత పాలకుల హయాంలో నిర్లక్ష్యం చేసిన వడ్డీ లేని రుణాలను ప్రజా ప్రభుత్వంలో పునరుద్ధరించామని స్పష్టం చేశారు. కోటీ మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే ప్రభుత్వ ఉద్దేశ్యంతో సంవత్సరానికి రూ. 21 వేల కోట్లతో మహిళలకు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేస్తున్నామని, మొదటి సంవత్సరం రూ. 21,632 కోట్ల వడ్డీ లేని రుణాలు అందించామని తెలిపారు. జూలై 12 నుంచి జూలై 21 వరకు వడ్డీ లేని రుణాల చెక్కులను మహిళలకు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్ లను ఏర్పాటు చేసి కరెంట్ వ్యాపారం నిర్వహించేలా, రైస్ మిల్లుల నిర్వహణ చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఆర్టీసీ సంస్థకు అద్దె బస్సులు మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేస్తున్నామని, ఇల్లందు నియోజకవర్గంలో మహిళ సంఘాలకు 5 బస్సులను కేటాయించడం జరిగిందని, ప్రతి బస్సుకు ప్రతి నెల రూ. 69 వేల చొప్పున 5 బస్సులకు రూ. 3. 47 లక్షలతో, 7 ఏళ్ల పాటు కొనసాగడం జరుగుతుందని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు మహిళల ద్వారానే చేపడుతున్నట్లు, ప్రభుత్వ పాఠశాలల మరమ్మతులు, నిర్వహణ, అమ్మ ఆదర్శ పాఠశాలలను మహిళా కమిటీలచే చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి వ్యాపారంలో మహిళలను భాగస్వామ్యం కల్పిస్తున్నామని అన్నారు. మహిళా సంఘాల సభ్యులకు రూ. 2 లక్షల లోన్ భీమా, రూ. 10 లక్షల ప్రమాద భీమాను ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. పాఠశాలలలో ఏకరూప దుస్తులు మహిళా సంఘాల ద్వారా కుట్టించి సరఫరా చేస్తున్నామని, మహిళా సంఘాల సభ్యులకు అవసరమైన శిక్షణ ప్రతి మండలంలో అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా ఇల్లందు నియోజకవర్గంలోని 215 పనుల్లో 6.60 కోట్లను కేటాయించడం జరిగిందని, ఇప్పటికే రూ. 6 కోట్లు నిధులు మంజూరు అయ్యాయని, స్వయం సహాయక సంఘ సభ్యులకు ప్రమాద బీమా రూ. 10 లక్షలు ఇవ్వడం జరుగుతుందని, 21 మంది సంఘ సభ్యులకు చెక్కులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. పేదోడు అంటేనే కాంగ్రెస్ పార్టీ అని, అదే ప్రజా ప్రభుత్వమన్నారు. ఇల్లందు నియోజకవర్గంలో 4500 ఇందిరమ్మ ఇండ్లను కేటాయించడం జరిగిందని, ఇంటికి భద్రత ఉండాలని లక్ష్యంతో ఆడబిడ్డల పేరుపై ఇవ్వడం గొప్ప



విషయమన్నారు. రూ. 5 లక్షలు ఇంటికి ఇచ్చిన ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేదని, అది కేవలం తెలంగాణ ప్రభుత్వమే అన్నారు. ఇల్లందు నియోజకవర్గానికి 4500 ఇండ్లకు రూ. 240 కోట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఇందిరమ్మ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని, ఇచ్చిన ప్రతి మాటకు కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపుల నిర్మాణం గత ఇందిరమ్మ హయాంలోనే జరిగిందన్నారు. ఇప్పుడు మహిళలు అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా రాణిస్తున్నారని స్పష్టం చేశారు. మహిళలను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. ఒకప్పుడు ఆడవారు ఇంటికే పరిమితమయ్యేవారని, రాను రాను గత అంధకారం నుండి ఇప్పుడు వెలుగులోకి వచ్చారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 65 లక్షల మంది మహిళా సభ్యులు మహిళా గ్రూపుల్లో ఉండగా, కోటి మందికి చేర్చి, కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ముందుకు పోతున్నట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి క్రింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, నియోజకవర్గంలో క్రొత్త రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం, రైతు భరోసా, రైతు భీమా, రైతు రుణమాఫీ, సన్న వడ్లకు కనీస మద్దతు ధర తో పాటు, రూ. 500 బోనస్, నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లతో పాటు అదనంగా మరో 1000 ఇందిరమ్మ ఇండ్లు, ఇలా అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. డ్వాక్రా మహిళలకు సోలార్ యూనిట్, ఆర్టిసి అద్దె బస్సులు, స్త్రీ టీలు, జీరాక్స్ సెంటర్లు ఇచ్చినట్లు, త్వరలో రైస్ మిల్లులు ఇవ్వనున్నట్లు తెలిపారు. మహిళా సంఘాల్లో నమోదు కాని వారుంటే వెంటనే కావాలని సూచించారు. ప్రభుత్వం 15-19 సంవత్సరాల వయస్సు, 65 సంవత్సరాలు దాటిన, దివ్యాంగులకు ప్రత్యేక సంఘాల ఏర్పాటుకు చర్యలు తీసుకుందని తెలిపారు. ఇల్లందు నియోజకవర్గంలోని 5300 స్వయం సహాయక సంఘాలకు రూ.4.85 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం. వెంకట్రావు, అడిషనల్ కలెక్టర్, డిఆర్డీవో పీడీ విద్యా చందన, జిల్లా ఎస్పి రోహిత్ రాజు, ఐటిడిఏ పిఓ రాహుల్, ఆర్డిఓ మధు, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, పిఏసిఎస్ డైరెక్టర్ లక్కినేని సురేందర్, జనగం కోటేశ్వరరావు, మేకల మల్లిబాబు యాదవ్, మూల మధుకర్ రెడ్డి, నియోజకవర్గ తహసీల్దార్లు, ఎంపిడివోలు, మండల సమాఖ్య సభ్యులు, ఏపిఎంలు, మహిళలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేషనల్ జియోస్పేషియల్ ప్రాక్టీషనర్ అవార్డు

(మొదటి పేజీ తరువాయి...)

ఓపెన్ సోర్స్ జియోస్పేషియల్ టెక్నాలజీ ద్వారా జిల్లా విద్యార్థులు, అధికారులు భాగస్వాములుగా పాల్గొని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమస్యలను లోకల్ స్థాయిలో పరిష్కరించే విధంగా కృషి చేసినందుకు ఈ రెండు అవార్డులు వరించాయి. జిల్లా స్థాయిలో జిఐఎస్ ఆధారిత వ్యవస్థలను ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసి, గ్రామీణ సమస్యల పరిష్కారంలో జియోస్పేషియల్ టెక్నాలజీ వినియోగంలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పినందుకు ఈ గుర్తింపు లభించింది. గోదావరి వరదల సమయంలో ఫ్లడ్ ప్రిడిక్షన్, గ్రామీణ స్థాయిలో జిఐఎస్ స్కిల్లింగ్, విభిన్న శాఖల డేటాను భౌగోళిక సమాచారంతో అనుసంధానం చేసి నిర్ణయాలు తీసుకునే విధానాలను జిల్లా యంత్రాంగం ముందుండి అమలు చేసింది. భారతదేశంలో మొట్టమొదటి "ఓపెన్ సోర్స్ జిఐఎస్ కోహార్ట్" ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏర్పాటు చేసి, ఐఐటి బాంబే పోసే జిఐఎస్ సహకారంతో క్యూ జి ఐ ఎస్ వినియోగాన్ని గ్రామీణ సమస్యల పరిష్కారానికి ప్రాక్టికల్ గా నేర్పడంలో జిల్లా నేతృత్వం వహించింది. గోదావరి వరదల ముందు ముంపు గ్రామాల గుర్తింపు, పి హెచ్ సి పరిధిలో విద్యార్థుల ఆరోగ్య పర్యవేక్షణ, పత్తి రైతులను మునగ సాగు వైపు మారుస్తూ రైతులను స్వయం సమృద్ధి వైపు నడిపించే ప్రయత్నాలు జిల్లాలో కొనసాగుతున్నాయి.

### అవార్డు అందుకున్న సందర్భంలో కలెక్టర్ మాట్లాడుతూ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భౌగోళికంగా తెలంగాణలో అతిపెద్ద జిల్లా, 37% గిరిజన జనాభాతో విస్తరించిన జిల్లా. గిరిజనుల విలువైన సంస్కృతి కలిసికట్టుగా అభివృద్ధి దిశగా ముందుకు వెళ్లే మార్గాన్ని చూపిస్తుందని, జిఐఎస్ సాయంతో పత్తి, మొక్కజొన్న పొలాలను మ్యాప్ చేసి, రైతులను మునగ సాగు వైపు మళ్లించే ప్రయత్నం మొదలుపెట్టామన్నారు, ఇది రైతులను ఆర్థికంగా స్వయం సమృద్ధిగా మార్చడానికి దోహదపడుతుందని, అదేవిధంగా మేకల పెంపకం, మేకపాల ఉత్పత్తి పెంపుదలపై జిఐఎస్ పరిశీలనలు జరుగుతున్నాయి. ఈ వేదిక ద్వారా ఐఐటి బాంబే పరిజ్ఞానాన్ని జిల్లాకు తీసుకువచ్చి, రైతులు, విద్యార్థులు, అధికారులు అందరికీ ఉపయోగపడేలా చేస్తున్నా మన్నారు, విద్యార్థులు ఐఐటి బాంబే సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయం, పట్టణాభివృద్ధి, కమ్యూనికేషన్ విస్తరణలో దృష్టి పెట్టి ఉత్పాదకతను పెంచి జిల్లాకు ఆర్థిక వృద్ధిని తీసుకురాగలరని నమ్మకం ఉందన్నారు, ఈ సందర్భంలో ఐఐటి బాంబే నిపుణులు, శాస్త్రవేత్తలు, వివిధ సంస్థలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఆహ్వానిస్తున్నా మనీ అన్ని విభాగాలను అనుసంధానించి అభివృద్ధి దిశగా కలిసి పనిచేయాలని కోరుకుంటున్నాను అన్నారు,

### జిల్లాకు గర్వకారణం

ఈ రెండు అవార్డులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాసులందరికీ గర్వకారణమని, జిఐఎస్ ఆధారిత కార్యక్రమంలో కృషి చేసిన హెచ్ పి హెచ్ ఎఫ్ బృందానికి, ఆస్ప్రెషనల్ బ్లాక్ ఫెల్లో నవనీతకు జిల్లా కలెక్టర్ శ్రీ జితేష్ వి. పాటిల్ అభినందనలు తెలిపారు. జిల్లా అభివృద్ధి దిశగా జిఐఎస్ వ్యవస్థలను మరింత సమర్థవంతంగా విస్తరించేందుకు, ప్రజల అవసరాలకు అనుగుణంగా వాటిని అందుబాటులోకి తీసుకురావడానికి జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. ఓపెన్ సోర్స్ సాఫ్ట్వేర్ ఎడ్యుకేటెడ్, జియో గ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఐఐటి బాంబే విద్యాశాఖ, భారత ప్రభుత్వం ఎన్ ఎం ఈ సి ఐ టి ఆధ్వర్యంలో నిర్వహించిన 'నేషనల్ జియోస్పేషియల్ అవార్డ్స్ 2025 (ఎడిషన్ 02)' లో ఈ రెండు అవార్డులు లభించాయి. ఇవి 'నేషనల్ జియోస్పేషియల్ పాలసీ 2022' 'ఇండియన్ స్పేస్ పాలసీ 2023' కు అనుగుణంగా జియోస్పేషియల్ వినియోగాన్ని ప్రోత్సహించడానికి గుర్తింపుగా నిలుస్తాయి

# ఫారెస్ట్ గ్రౌండ్ ను మున్సిపాలిటీకి అప్పగించండి





**ఇల్లందు, జులై 17, ప్రజాజ్యోతి:** పట్టణంలోని ఫారెస్ట్ గ్రౌండ్ ను మున్సిపల్ మేజిస్ట్రేట్ కోర్టు భవనాల నిర్మాణం కోసం కేటాయించడాన్ని రద్దు చేసి, ఆ స్థలాన్ని క్రీడా మైదానంగా మార్చి ఇల్లందు మున్సిపాలిటీకి అప్పగించాలని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మడత వెంకట్ గౌడ్ గురువారం తెలంగాణ పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) కు వినతిపత్రం అందజేశారు. ఇల్లందు మున్సిపల్ కోర్టుకు సమీపంలో ఉన్న ఫారెస్ట్ గ్రౌండ్ ను గతంలో క్రికెట్, పుట్ బాల్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, ట్రాక్ వంటి వివిధ క్రీడలలో శిక్షణ కోసం అథ్లెట్లు ఉపయోగించేవారని, దసరా జమ్మి పూజకు సాంప్రదాయకంగా ఉపయోగించే ప్రక్కనే ఉన్న జమ్మి మైదానాన్ని చర్చి నిర్మాణం కోసం సిఎస్ఐ చర్చి ఆక్రమించిందని ఆరోపించారు. కొత్త కోర్టు భవనాల కోసం ఫారెస్ట్ గ్రౌండ్ కేటాయించబడినప్పటికీ, అదనపు కోర్టును తర్వాత రద్దు చేశారని, ప్రస్తుతం ఉన్న కోర్టు భవనం సరిపోతుందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు.కేటాయించిన క్రీడా మైదానం గత 4 సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉందని, ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన, గిరిజనేతర నివాసితుల ప్రయోజనం కోసం ఫారెస్ట్ గ్రౌండ్ ను క్రీడా మైదానంగా అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, కాంగ్రెస్ నాయకులు, ఏక్త హౌస్ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై మంత్రికి వినతి



**ఇల్లందు, జులై 17, ప్రజాజ్యోతి:** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఇల్లందుకు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి గురువారం సింగరేణి గెస్ట్ హౌస్ లో సిపిఐ (యంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఆవునూరి మధు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రంగా ఉందని, సీతారామ ప్రాజెక్టు నీళ్లను జిల్లాలోని అన్ని ప్రాంతాలకు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని, కొమరారం, బోడులను మండలాలుగా ఏర్పాటు చేస్తూ ఇల్లందును రెవెన్యూ డివిజన్ గా గుర్తించాలని కోరారు. సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు నాయకులు డి. ప్రసాద్, కొక్కు సారంగపాణి, సామ్యూల్, ఎట్టి నరసింహారావు, రామిశెట్టి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కొరత లేకుండా చూడాలని ఎమ్మార్వోకు వినతి పత్రం అందజేత

- ఏఐకేఎంఎస్ న్యూడెమోక్రసీ బృందం



**టేకులపల్లి,జులై17,ప్రజాజ్యోతి:** రైతులకు యూరియాను కొరత లేకుండా అందుబాటులో ఉంచాలని ఏఐకేఎంఎస్ న్యూడెమోక్రసి బృందం ఆధ్వర్యంలో గురు వారం ఎమ్మార్వో వీరభద్రంకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు, ఏఐకేఎంఎస్ మండల కార్యదర్శి ఎట్టి నరసింహారావు మాట్లాడుతూ :ఈ సీజన్లో పంటలు వేసి వర్షాల కోసం ఎదురు చూడవలసిన రైతులు విత్తనాలు వేసి ఫైర్ ఎరుగుదల కోసం యూరియా కట్టల కోసం ఎదురుచూస్తున్నారని యూరియా లేకపోవడంతో పంటలు రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు అన్నారు.రైతులు రాత్రింబవళ్లు కష్టపడి రెక్కలు ముక్కలు చేసుకుని యావత్ ప్రపంచానికి అన్నం పెట్టే రైతు అరా కోర కాలాలతో ఇబ్బందులు పడుతున్నాడని వారన్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక ఒకపక్క పంట వేయడానికి సరైన మందులు కనీసం యూరియా కూడా లేకపోవడంతో రైతులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు వారు అన్నారు. యూరియా కోసం కుటుంబంతో సహా తెల్లవారుజామునే యూరియా కోసం సొసైటీల ముందు క్యూలో నిలబడి నిద్రాహారాలు మాని ఉండవలసిన పరిస్థితి ఏర్పడుతుందని వారు ఆరోపించా రు. యావత్ ప్రపంచానికి అన్నం పెట్టే రైతే లైన్లో నిలబడే పరిస్థితి వచ్చి మందుల్ని అడుక్కోవాల్సిన దౌర్భాగ్యస్థితికి నెట్టబడ్డాడని వారు అన్నారు.తక్షణమే రాష్ట్రంలో నెలకొని ఉన్న యూరియా సమస్యను వెంటనే పరిష్కరించాలని రైతులందరికీ ప్రభుత్వమే యూరియా సరఫరా చేయాలని లేనియెడల కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐకె ఎంఎస్, న్యూ డెమోక్రసీ మండల నాయకులు భూక్య హర్జ, నర్సింగ్,ధరావత్ వెంకన్న,మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

## హక్కుల సాధనకై హెచ్ఎంఎస్ పోరాటం రియాజ్ అహ్మద్



**కొత్తగూడెం (సింగరేణి), జూలై 17, ప్రజాజ్యోతి ;** సింగరేణి కార్మికులు ఎదుర్కుంటున్న సమస్యలను అధిగమించి వారి హక్కుల సాధనకై హెచ్ఎంఎస్ పోరాడుతుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు , జేబీసీసీ మెంబర్ రియాజ్ అహ్మద్ స్పష్టం చేశారు. గురువారం కొత్తగూడెం ఏరియా సత్తుపల్లి జేవిఆర్ఓసి నందు హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ మీటింగ్ కు అయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇందులో భాగంగా రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు దాదాపు 50 రకాల వాగ్దానాలు చేశారు. కానీ నేటి వరకు ఏ ఒక్క వాగ్దానాన్ని కూడా స్పష్టమైన పరిష్కారం చేయలేకపోయారని మండిపడ్డారు. కార్మికులను మోసం చేసి మాయ మాటలతో ఓట్లు దండుకున్న సంఘాలు కార్మికులకు లాబాదాయకమైన ఎటువంటి కార్యక్రమాలు చేయలేకపోయారని విమర్శించారు. అదే రకంగా స్టాండర్డ్ మీటింగ్లో జరిగిన చర్చలు, వేజ్ బోర్డులో ప్రస్తావించిన అంశాలు, హెచ్ఎంఎస్ యూనియన్ చేపట్టే కార్యక్రమాల గురించి అయన వివరించారు. సింగరేణి ఏరియాలలో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, సాధన కార్యక్రమాల పట్ల హెచ్ఎంఎస్ ఎల్లవేళల అధికారులతో చర్చలు చేపడుతుందని వివరించారు. హెచ్ఎంఎస్ ఎప్పటికప్పుడు కార్మిక పక్షాన పోరాటం చేస్తుందని.., ఆదే రకంగా కొత్త ఉద్యోగాలు, కొత్త బావులు, సింగరేణి మునగడ కోసం అహర్నిశలు ముందుండి కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. ఇందులో భాగంగా సీఎంఓను, సంభందిత అధికారులను కలిసి పలు సమస్యలపై మెమోరండం అందజేసారు. ఈ కార్యక్రమంలో ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, బ్రాంచ్ సెక్రెటరీ ఆసిఫ్, సత్తుపల్లి ఏరియా ఇన్చార్జ్ అజ్గర్ ఖాన్, కొత్తగూడెం ఏరియా మైనింగ్ స్టాఫ్ ఇంచార్జ్ సాంబశివరావు, సెంట్రల్ కమిటీ మెంబర్ నసీం ఖాన్, జేవిఆర్ఓసి ఫిట్ సెక్రెటరీ శ్రీనివాస్, సమంత సెక్రెటరీ నరసింహారావు, మహేష్, కిష్టారం ఓసి సెక్రెటరీ మొగిలి, కొత్తగూడెం ఆర్సిఎస్పి సెక్రెటరీ పూర్ణచందర్, వీకే వర్క్ షాప్ సెక్రటరీ కరీం, పివికే 5 సెక్రెటరీ చిట్టిబాబు, ఏరియా బ్రాంచ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వరానంద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలచందర్ రెడ్డి, ఓల్డ్ సిఎస్పి సెక్రెటరీ షకీల్, ప్రవీణ్, కనకారావు, మహేష్, పవన్, రమేష్, అలీమ్ పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రంథాలయ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన వీరబాబు

- గ్రంథాలయాలు ప్రత్యక్ష దేవాలయాలు
- జిల్లాలోని గ్రంథాలయాలను అభివృద్ధి చేస్తా
- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వీరబాబు





**కొత్తగూడెం కలెక్టరేట్, జూలై 17 ప్రజా జ్యోతి:** జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా పసుపులేటి వీరబాబు గురువారం పదవి బాధ్యతలు చేపట్టారు. వీరబాబు యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులుగా, పలు నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ కార్యకలాపాల ఇన్చార్జిగా, కొత్తగూడెం ,ములుగు నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ బాధ్యునిగా, ఎమ్మెల్సీ ఎన్నికల జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పలు హోదాల్లో పనిచేశారు. కాంగ్రెస్ పార్టీ విధేయుడినిగా పేరున్న ఆయనను గ్రంథాలయ చైర్మన్ గా నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం విధితమే. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కరుణ కుమారి ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందించి ఘన స్వాగతం పలకడం తో పాటు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె వీరబాబుకు జిల్లా గ్రంథాలయ ఉద్యోగులను పరిచయం చేశారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రంథాలయాలను త్వరలో పరిశీలిస్తానని, ఆయా గ్రంథాలయాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వానికి విన్నవించి పరిష్కరించే దిశగా కృషి చేయనున్నట్లు తెలిపారు. గ్రంథాలయాలు ప్రత్యక్ష దేవాలయాలతో సమానమని, అలాంటి దేవాలయాలను సంపూర్ణంగా తీర్చిదిద్ది ఉద్యోగులు సిబ్బంది సహాయ సహకారాలతో రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుపుతానని తెలిపారు. అంతా కలిసిమెలిసి పని చేద్దామని, పోటీ పరీక్షలకు సిద్ధపడే వారికి పాఠకులకు అనుకూలమైన వాతావరణాన్ని గ్రంథాలయాల్లో మరింతగా ఏర్పాటు చేద్దామని తెలిపారు. రాబోయే రోజుల్లో గ్రంథాలయాల పరిరక్షణకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ ఇంచార్జ్ ఎం నవీన్ కుమార్, గ్రంథ పాలకులు జి. మణి మృదుల, నాగన్న, మధుబాబు అశ్వరావుపేట నియోజకవర్గ బీసీ సంఘం యువజన అధ్యక్షులు పల్లె వరప్రసాద్, లక్ష్మీదేవి పల్లి మండలం కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు జల్లారపు ఈశ్వర్, భద్రాద్రి బీసీ సంఘం ఉపాధ్యక్షులు బండి శ్రీకాంత్ గౌడ్, లక్ష్మీదేవి పల్లి మండలం యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు లావుడియా నరేష్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## గురుకులాల పనివేళలు సవరించండి

- టీఎస్ యుటిఎఫ్ మైనారిటీ గురుకులం వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేష్ డిమాండ్

**భద్రాచలం టౌన్, జులై 17(ప్రజాజ్యోతి):** గురుకులాలలో అసంబద్ధంగా ఉన్న పాఠశాలల పని వేళలు మార్చాలని, ప్రతి గురుకులంలో కేర్ టేకర్లను నియమించాలని టీఎస్ యుటిఎఫ్ మైనారిటీ గురుకులం వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేష్ అన్నారు. గురువారం టీఎస్ యుటిఎఫ్ సభ్యత్వం నమోదు కార్యక్రమంలో భాగం గా స్థానిక మైనార్టీ గురుకులం పాఠశాలలో ప్రిన్సిపల్ రాజా సమ్మయ్య అధ్యక్షతన భద్రాచలం మండల శాఖ ఆధ్వర్యంలో టీఎస్ యుటిఎఫ్ మైనారిటీ గురుకులం వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేష్ సమక్షంలో సభ్యత్వము జనరల్ ఫండ్ క్యాంపెయిన్ నిర్వహించారు.ఈ సందర్భంగా టీఎస్ యుటిఎఫ్ మైనార్టీ గురుకులం వింగ్ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ గురుకులాలలో 0 1 0 పద్దు క్రింద గురుకుల ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలని, సమస్యల పరిష్కారంలో ప్రభుత్వము యొక్క సాచివేత ధోరణి సరైనది కాదు అని అభిప్రాయ



పడ్డారు.ఉపాధ్యాయ సమస్యల పోరాట కమిటీ (యూఎస్పిసి) ఆధ్వర్యంలో నిర్వహించే మూడు దశల పోరాట కార్యక్రమం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాల టీఎస్ యుటిఎఫ్ మైనారిటీ వింగ్ ప్రధాన కార్యదర్శి దామోదర్, రాష్ట్ర కార్యదర్శి క్రాంతి, జిల్లా కార్యదర్శి ఎస్ విజయ్ కుమార్, మండల అధ్యక్షులు కొమరం శ్రీనివాస్, గురుకుల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న ఆనంద ఆశ్రమ పీఠాధిపతి



**భద్రాచలం టౌన్,జూలై 17(ప్రజాజ్యోతి) :**భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారిని ఆనంద ఆశ్రమ పీఠాధిపతి, ఆంధ్రప్రదేశ్ సాధుపరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పూజ్యశ్రీ శ్రీశ్రీనివాసానంద సరస్వతి స్వామిజీ గురువారం దర్శించుకున్నారు. తొలుత ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు, వేదాశీర్వచనాలు అందించారు. ఆలయంలోని ఉప ఆలయాలైన లక్ష్మీతాయారు, అభయాంజనేయస్వామి వార్లను దర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామిజీకి ఆలయ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో కురిచేటి శ్రీనివాస్, ఆలయ అధికారులు, ఉద్యోగులు, అర్చకులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం



**భద్రాచలం టౌన్,జూలై 17(ప్రజాజ్యోతి):**భద్రాచలం దివ్యక్షేత్రంలోని బేడా మండపంలో అర్చకులు గురువారం స్వామివారికి నిత్యకల్యాణం నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యబలిహరణం, నిత్యహోమాలు, నిత్యపూజలు జరిపారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పెంచిన మద్యం ధరలు తగ్గించాలి




**భద్రాచలం టౌన్,జూలై 17(ప్రజాజ్యోతి) :**ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం మద్యం ధరలు పెంచడం సిగ్గుచేటని, పెంచిన ధరలు తగ్గించి, కల్తీ మద్యాన్ని నివారించి అధిక ధరలకు విక్రయించే మద్యం వ్యాపార దుకాణాలపై చర్యలు తీసుకోవాలని పీవోడబ్ల్యు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పెద్దగోని ఆదిలక్ష్మి, కల్తీ సుభద్రలు డిమాండ్ చేశారు. గురువారం భద్రాచలం డివిజన్ నిర్మాణ జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు మద్యపాన నిషేధం అమలుచేస్తామని చెప్పిన రేవంత్ ఇప్పుడు అధికారంలోకి వచ్చి ఆ హామీని నెరవేర్చకపోగా మద్యం ధరలు పెంచి కుటుంబాలు బజారున పడేసేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఫ్రీ బస్సుల పేరుతో మహిళలను కించపరుస్తున్నారని, బస్సులను తగ్గించి ఈ పథకాన్ని అమలుచేస్తూ మహిళలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. విద్యాసంస్థలు, ఆసుపత్రుల వద్ద నిర్వహించే బెల్టుదుకాణాలను తక్షణమే నిషేధించి అధిక ధరలకు మద్యం అమ్మే వారిపై చర్యలు తీసుకోవాలని, లేదంటే పీవోడబ్ల్యు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. విప్లవ ఉద్యమంలో అమరులైన స్నేహలత, రంగవల్లి, సుశేన, చింతా లక్ష్మికి నివాళులర్పించారు. ఈ సమావేశంలో డివిజన్ నాయకులు కోట నాగమణి, కప్పల సూర్యకాంతం, పాయం రాజమ్మ, ఆదిలక్ష్మి, శ్రీదేవి, సమ్మక్క, సునీత, హేమలత తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలలో ముందుండాలి

- ఐటీడీఏ పీవో రాహుల్





**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 17, ప్రజా జ్యోతి**

గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు చదువుతో పాటు అన్ని మౌలిక వసతులు కల్పించి, వివిధ క్రీడలలో కూడా ప్రత్యేక తర్ఫీదు ఇచ్చి వారిని అంతర్జాతీయ స్థాయి క్రీడలలో పాల్గొనేలా ప్రణాళికలు రూపొం స్తున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు.గురువారం పాల్వంచలోని గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాలలో కొత్తగా ఏర్పాటు చేసిన టేబుల్ టెన్నిస్ ను క్రీడలను శిక్షణ కలెక్టర్ సౌరబ్ శర్మతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో దాగివున్న ప్రతిభా నైపుణ్యాలను వెలికితీయడానికి అన్ని ఆశ్రమ పాఠశాలల్లో కొత్తగా వ్యాసరచన, ఉపన్యాసం పోటీలతోపాటు కుట్లు , అల్లికలు, కరాటే తదితర అంశాలలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారిలో నైపుణ్యాన్ని పెంపొందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. గతంలో విద్యార్థులు మంచి మార్కులు సాధించ డమే కష్టంగా ఉండేదని ప్రస్తుతం విద్యతో పాటు శారీరకంగా, మానసికంగా, దృఢత్వంతో పాటు నైపుణ్యాన్ని పెంపొందించేందుకు గాను ప్రత్యేక తరగతులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఐదు ఆశ్రమ పాఠశాలలో హాకీ, హ్యాండ్ బాల్, బాల్ బ్యాట్మెంటన్ , రెజ్లింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ ఏడాది ఐదు ఆశ్రమ పాఠశాలలో టేబుల్ టెన్నిస్ కూడా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని అనుకున్నది లక్ష్యం సాధించేవరకు శ్రమించాలని అన్నారు. పాఠశాల ఆవరణలో చెత్తాచెదారం లేకుండా ఎప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని అలాగే వంట చేసే సిబ్బంది పరిశుభ్రతను పాటించి తాజా కూరగాయలతో విద్యార్థులకు సమయానుకూలంగా భోజనం అందించా లని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ టి డి ఓ చంద్రమోహన్, స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాలరావు, అసిస్టెంట్ స్పోర్ట్స్ ఆఫీసర్ వెంకటనారాయణ, హెచ్ఎం భద్రం, వార్డెన్ పవన్, టి డి ఐ గోపాల్ రావు, పి ఈ టి ,పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా గణిత ఫోరం ఆధ్వర్యంలో ప్రేమ్సాగర్ కుటుంబానికి ఆర్థికసాయం



**భద్రాచలం టౌన్,జూలై 17(ప్రజాజ్యోతి) :**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గణితఫోరం ఆధ్వర్యంలో మోతుకూరి ప్రేమ సాగర్ మృతిచెందగా బాధిత కుటుంబానికి గురువారం ఫోరం సభ్యులు రూ.28.400 ఆర్థికసాయం అందజేశారు. గణితఫోరం జిల్లా అధ్యక్షుడు పవన్ కుమార్, ప్రధాన కార్యదర్శి చిక్క ఫల్గుణలు ఎంఈవో సున్నం సమ్మయ్య చేతులమీదుగా బాధిత కుటుంబానికి ఈ సహాయం అందించారు. ప్రభుత్వపరంగా ప్రేమ్ సాగర్ రావాల్సిన వాటిని సకాలంలో అందించేలా కృషిచేస్తామని, కుటుంబానికి ఎలాంటి అవసరం ఉన్నా గణిత ఫోరం తరఫున సహాయ, సహకారాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సోయం కృష్ణ, సోయం హనుమంతరావు, బొర్రయ్య, రాజా శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాసరావు, ఎస్.ఎస్.రాజు పాల్గొన్నారు.

## రామవరం రిజర్వు అటవీ ప్రాంతంలో విత్తనాలు జల్లిన ఎన్ సి సి విద్యార్థులు




**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 17, ప్రజా జ్యోతి :**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ స్ఫూర్తితో జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు విత్తనాలను సేకరించారు. కొత్తగూడెం మండల పరిధిలో సేకరించిన సుమారు 40 కేజీల గానుగ, వేప, టేకు తదితర గింజలను మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ ప్రభు దయాల్ ఆధ్వర్యంలో ఆనందఖని పాఠశాలకు చెందిన ఎన్ సి సి విద్యార్థులు రామవరం రిజర్వు అటవీ ప్రాంతంలో గురువారం విరివిగా జల్లారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో ఎన్ సి సి ఇన్చార్జి ఆఫీసర్ వీరు, హెచ్ఎం లక్ష్మి , ఉపాధ్యాయులు రమేష్, ఎన్ సి సి విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆలయ భూముల అధ్యయనం కోసం పురుషోత్తపట్నం సందర్శించిన స్వామీజీ బృందం

- ఆలయ అధికారులు, గ్రామస్థులతో ముఖాముఖి



**భద్రాచలం టౌన్, జూలై 17(ప్రజాజ్యోతి) :**భద్రాచలం రాముడు భూముల వివాదం కీలకమలుపు తిరిగింది. భద్రాచలం రామాలయ భూముల వివాదంపై అధ్యయనం కోసం భద్రాచలం వచ్చిన స్వామిజీ బృందం పురుషోత్తపట్నం గ్రామాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆనంద ఆశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీనివాసానంద సరస్వతి స్వామిజీ బృందం పురుషోత్తపట్నంలో గ్రామస్థులతో ముఖాముఖి నిర్వహించారు. దశాబ్దాలుగా రామాలయం 889 ఎకరాల భూములకు సంబంధించి ఆలయ అధికారులు, పురుషోత్తపట్నం గ్రామస్థులకు మధ్య జరుగుతున్న వివాదంపై స్వామిజీ ముఖాముఖిలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత స్వామిజీ మాట్లాడుతూ రామయ్య భూములపై ఆధారపడి బతుకుతున్న రామభక్తుల కంటే మీకు రాముడిని నిత్యం దూషించే అన్యమత ప్రచారకులకు 12 ఎకరాల భూమి ఎలా కేటాయించారని ప్రశ్నించారు. రాముడు భూమిని 12 ఎకరాలు అనుభవిస్తున్న వారిని ఖాళీ చేయించిన తర్వాత పురుషోత్తపట్నం గ్రామస్థులను ఖాళీ చేయించాలని డిమాండ్ చేశారు. రామాలయ భూముల్లో వెలిసిన క్రైస్తవ చర్చిలను, స్కూల్స్ వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. రామాలయ భూములకు సంబంధించి అటు ఆలయ అధికారులు, ఇటు గ్రామస్థులు నష్టపోకుండా రెండు రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఈ ముఖాముఖిలో స్వామిజీ బృందం సభ్యులు, ఆలయ అధికారులు, పురుషోత్తపట్నం గ్రామపెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రెండు క్యాడర్లను పెంచాలని మంత్రికి వినతి

**ఇల్లందు, జులై 17, ప్రజాజ్యోతి :**ముఖ్యమంత్రితో చర్చించి గ్రామీణ పేదరిక నిర్మూలన, ఐకేపీ ఉద్యోగుల రెండు క్యాడర్ల పెంపుకు సహకరించాలని, ఉద్యోగ నియామక పత్రాలను పంపిణీ చేయాలని గురువారం ఇల్లందుకు వచ్చిన రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. గ్రామ సంఘ సహాయకుల వేతనాల పెంపు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుర్గారావు, రామ్మూర్తి, స్వర్ణలత, నాగేంద్ర, భద్రం భూలక్ష్మి, రవికుమార్ సుభాష్, నరసింహారావు, సునీల్, శ్యాం కుమార్, నరేంద్ర, సంపత్, విఓఏలు పాపారావు, నవ్య, ప్రమీల, చందర్ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వసతులు కల్పిస్తున్నాం

- అన్ని సౌకర్యాలు అందిస్తాం.. ఉన్నత విద్యలు అభ్యసించండి
- ప్రభుత్వ పాఠశాలలు అత్యుత్తమంగా పని చేయాలన్నదే ప్రభుత్వ ధ్యేయం
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార , పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి





**అశ్వారావుపేట, జూలై 17, ప్రజాజ్యోతి:** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్దాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం మహాత్మ జ్యోతి బాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఐటిడిఏ పిఓపి రాహుల్ తో కలిసి మంత్రి పొంగులేటి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, వసతులపై ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తుందన్నారు. విద్యార్థులుగా మీకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఉన్నత చదువులు చదివి మీ కుటుంబానికి, గ్రామానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నామన్నారు. పలు అధికారులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం 327 జెన్కో యూనిట్ కార్యవర్గం ఎన్నిక



**కొత్తగూడెం కలెక్టరేట్, జులై 17, ప్రజా జ్యోతి :**తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం 327 జెన్కో యూనిట్ నూతన కార్యవర్గాన్ని గురువారం హనుమకొండలో ఎన్నుకున్నారు, హనుమకొండలోని పల్లా రవీందర్ రెడ్డి భవన్లో నిర్వహించిన సంఘ సమావేశంలో రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ పరిశీలకులుగా వ్యవహరించ గా, రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం ఐలేష్ ఎన్నికల అధికారిగ వ్యవహరించారు, అనంతరం జన్కో యూనిట్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు ప్రెసిడెంట్ గా పి మాధవ్ రావు కేటీపీపీ, సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా టీ మధుసూదన్ రెడ్డి నాగార్జునసాగర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా జక్కుల రమేష్ కేటిపిపి, వైస్ ప్రెసిడెంట్ గా లావుడియా శీను కేటీపీఎస్, బి యాదగిరి ఆర్టిఎస్, టి తిరుపతి కే టి పి పి జనరల్ సెక్రటరీగా సిహెచ్ సాయిబాబా, కే టి పి ఎస్ సీనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న బూర్గుల విజయభాస్కరరావు వైస్ ప్రెసిడెంట్బి టి పి ఎస్, జాయింట్ సెక్రటరీగ సి రాజు ఆర్టిఎస్,ఆర్గనైజింగ్ సెక్రటరీగా బి ఎల్లయ్య వైటిపిఎస్, కోశాధికారిగా ఓ దామోదర్ రావు కే టి పి పి లు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఎన్నికైన వారిని అనంతరం యూనియన్ నాయకులు ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షులు పి మహేందర్ రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసరావు, హనుమకొండ జిల్లా అధ్యక్షులు డి సదయ్య, వరంగల్ జిల్లా కార్యదర్శి మచ్చిక బుచ్చయ్య గౌడ్, అధ్యక్షులు గుండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక నిల్వలను స్వాధీనం చేసుకున్న రెవిన్యూ అధికారులు



**ములకలపల్లి ,జూలై 17, ప్రజా జ్యోతి:** నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేసిన ఇసుక రాసులను గురువారం రెవిన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ములకలపల్లి ఆర్ ఐ బాదావత్ భద్రు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వికె రామవరం పంచాయతీ సంజీవపల్లి హెలిప్యాడ్ వద్ద నిబంధనల కు విరుద్ధంగా ఇసుక ఇసుకను నిల్వ చేసి ఉన్నారని నమ్మదగిన సమాచారం అండటంతో స్థానిక తహశీల్దార్ గన్యా ఆదేశాల మేరకు సంఘటన స్థలానికి వెళ్ళి తనిఖీలు నిర్వహించగా నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేసిన సుమారు నాలుగు లారీల ఇసుక గుర్తించి అట్టి ఇసుక రాసులను స్వాధీనం చేసుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించడం జరిగిందని తెలిపారు.

## యాకయ్య ఇంట్లో తేనేటి విందుకు హాజరైన మంత్రి



**ఇల్లందు, జులై 17, ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఆదివాసి జేఏసీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు పెండేకట్ల యాకయ్య ఆహ్వానం మేరకు వారి ఇంట్లో తేనేటి విందుకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ టిపిసిసి సభ్యుడు జానీ, కూరగాయల వ్యాపారి గౌస్, ఐఎన్టియుసి సెంట్రల్ జనరల్ సెక్రెటరీ గోచికొండ సత్యనారాయణ, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోచికొండ శ్రీదేవి, కాంగ్రెస్ నాయకులు పెండ్యాల రాజు, శివ, అశోక్, చీమల నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తు కోసం సికిల్ సెల్ పరీక్షలు అత్యంత అవసరం



**అన్నపురెడ్డిపల్లి, జూలై 17, ప్రజా జ్యోతి:**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల ఎర్రగుంట ఉన్నత పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది సికిల్ సెల్ పరీక్షలు నిర్వహించారు. ఎర్రగుంట ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రియాంక నేతృత్వంలో ఈ పరీక్షలు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి విద్యార్థికి చిన్న వయసులోనే ఈ పరీక్ష ఎంతో అవసరమని, ముందుగానే గుర్తిస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవచ్చని తెలియజేశారు. ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు మండలంలోని ప్రతి పాఠశాలలో విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహిస్తారని మండల విద్యాశాఖ అధికారి ఉండేటి ఆనంద కుమార్ తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల్లోని ఎస్.టి విద్యార్థులందరికీ ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్ష అనంతరం ప్రతి విద్యార్థికి సంబంధిత సికిల్ సెల్ గుర్తింపు పత్రం ఇస్తారు. పాజిటివ్, నెగటివ్ జాబితాలు కూడా అందజేస్తారు. ఈ పరీక్షలు మండలంలో గుర్తించబడిన 820 మందికి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులు అరెస్ట్




**టేకులపల్లి, జూలై 17, ప్రజాజ్యోతి :** మండలంలోని డాల్ఫిన్ బేకరీ వద్ద కెసిఆర్ కాలనీ చెందిన గుగులోత్ రవి పై జరిగిన హత్యాయత్నం కేసులో ఇద్దరు ముద్దాయిలను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఎ. రాజేందర్ తెలిపారు.స్థానిక టేకులపల్లి పోలీస్ స్టేషన్లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డాల్ఫిన్ బేకరీ వద్ద ఈ నెల 7వ తేదీ గుగులోత్ రవి కూర్చొని ఉండగా గుగులోత్ వినోద్ కత్తితో రవిపై దాడి చేసి పొట్ట భాగంలో భలంగా పొడిచి హత్యప్రయత్నం చేశారు.బాధితుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.రవి పై హత్యాయత్నానికి పాల్పడిన గుగులోత్ వినోద్,వినోద్ కి సహకరించిన వాంకుడోత్ ప్రవీణ్ కుమార్ లను గురువారం ఉదయం గుగులోత్ వినోద్ ఇంటి వద్ద వారిద్దరిని అదుపులోకి తీసుకున్నారు.బాధితుడురవి కి ముద్దాయికి భూమి తగాదాలుకొద్దిరోజులుగా గొడవలు ఉన్నాయి. రవి పై కక్ష పెంచుకొని కత్తితో దాడి చేసి చంపడానికి ప్రయత్నించారు. వారి వద్ద నుంచి 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. నిందితుల అరెస్టుకు సహకరించిన ఎస్సై,పోలీసు సిబ్బందిని సీఐ తాటిపాముల సురేష్ అభినందించారు.

## మిరప నారుపై పిచికారి చేసిన గుర్తు తెలియని వ్యక్తులు



**టేకులపల్లి, జూలై 17,ప్రజాజ్యోతి :** మండలంలోని సులానగర్ గ్రామంలో ఓ ముగ్గురు వ్యక్తు లు కలిసి మిరప నారు సాగు చేస్తున్న క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు మిరప నారుపై గడ్డి మందు పిచికారి చేసిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.... టేకులపల్లి మండ లంలోని సులానగర్ గ్రామనికి చెందిన అజ్మీర వీరన్న, అజ్మీర హటియా, కందుకురి రాములు వీరు ముగ్గురు కలిసి మిరపనారును చేసులో 15రోజుల నుంచి సాగు చేస్తున్నారు. అజ్మీర వీరన్న 70 ప్యాకెట్లు, అజ్మీర హటియా 80 పాకెట్లు, కందుకూరి రాములు 50 ప్యాకెట్లు సుమారు 2వందల ప్యాకెట్లను 2లక్షలు ఖర్చు చేసి వేశారు. గురువారం మిరప నారును చూస్తే చనిపోయి ఉంది. గుర్తు తెలియని వ్యక్తులు గడ్డిమందు పిచికారి చేసి వెళ్ళినట్లు గుర్తిం చారు. మిరప నారుపై గిడ్డి మందు చల్లిన వ్యక్తులు పట్లుకొని మాకు న్యాయం చేయాలని టేకులపల్లి పోలిసులను బాధితులు ఆశ్రయించారు.

# జూలై 23 తేదీన జరిగే రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్ ను జయప్రదం చేయండి

- - నూతన జాతీయ విద్య విధానాన్ని- 2020 రద్దు చేయాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పల రవీందర్




**భద్రాచలం టౌన్, జులై 17(ప్రజాజ్యోతి):** రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగ సమస్యల పరిష్కారానికి జులై 23 తేదీన జరిగే రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బందును జయప్రదం చేయాలని, ఈ బందులో అత్యధికంగా విద్యార్థి లోకం పాల్గొనాలని, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పుల రవీందర్ కోరారు. ఈ కార్యక్రమం ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు దేవేందర్ అధ్యక్షత వహించగా అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కొప్పుల రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం నర కాలం గడుస్తున్న ఇంతవరకు పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్స్ ఫీజు రీయింబర్స్మెంట్, బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలను విడుదల చేయలేదని, దీని కారణంగా విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని, యజమాన్యాలు విద్యార్థులను తీవ్రస్థాయిలో గురి చేస్తున్నారని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గురుకుల పాఠశాల కు స్వంత భవనాలు లేక అద్దె భవనాల్లో పాఠశాల నడిపించడం వలన విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. గురుకుల పాఠశాల కు స్వంత భవనాలు వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు.మెస్ కాస్మోటిక్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు.దూర ప్రాంతంల నుంచి వచ్చే విద్యార్థులకు ఉచిత బస్ పాసులు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యా రంగంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు సుప్రియ,తేజ,లాహరి,స్పందన, కీర్తి, కావ్య,మధు, సందీప్,సావూల్, ప్రవీణ్,సాయి వర్మ,అక్షిత్, చరణ్,అనిల్, తదితరులు పాల్గొన్నారు.

# అన్నపురెడ్డిపల్లిలో వికాస్ తరంగిణి ఆధ్వర్యంలో మహిళల స్క్రీనింగ్ శిబిరం





**అన్నపురెడ్డిపల్లి, జూలై 17, ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి గ్రామంలో మహిళలలో ఇటీవలి కాలంలో అధికంగా నమోదవుతున్న రొమ్ము క్యాన్సర్ మరియు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌లను ముందు గానే గుర్తించి నివారించేందుకు వికాస్ తరంగిణి ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి నుండి డాక్టర్ లలిత కుమారి, పాల్వంచ నుండి డాక్టర్ రూప వంటి గైనకాలజిస్టుల పర్యవేక్షణలో మహిళలకు డబ్ల్యుహెచ్వో ఆమోదించిన వీఐఏ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్ష ద్వారా బ్లడ్ టెస్టులు లేకుండానే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ తొలి లక్షణాలను గుర్తించవచ్చు. అలాగే, రొమ్ము భాగాన్ని పరిశీలించి అనుమానాస్పద లక్షణాలపై మహిళలకు సమాచారం అందజేశారు. పరీక్షల్లో ఎవరికైనా అనుమానాస్పద లక్షణాలు కనిపించినవారికి తగిన వైద్య సలహాలు ఇవ్వబడినది. ఈ శిబిరంలో పెద్ద ఎత్తున మహిళలు, 500 మందికి పైగా పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్య సలహాలు, సేవలపై వారు చాలా సంతోషం





వ్యక్తం చేశారు. ఈ శిబిరం పూర్తిగా ఉచితంగా ఉండడమే కాక, మహిళల ఆరోగ్యంపై అవగాహన పెంపొందించే ఉద్దేశంతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వికాస్ తరంగిణి ఉమ్మడి జిల్లాల ఆర్గనైజర్ రోజా, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు పర్సా వెంకట్, ఈవో కాకాల వెంకటరమణ, శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున గుడి చైర్మన్ మల్లెల నరసింహారావు, వైస్ చైర్మన్ గుజ్జా పూర్ణచంద్రరావు, మాయర కృష్ణ, కేసరి కృష్ణ, బోయినపల్లి వెంకటేశ్వరరావు, గుజ్జా బుచ్చమ్మ, దోసపాటి రాంబాబు, వికాస్ తరంగిణి సేవా సభ్యులు, గుడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఆగస్టు 1వ తేదీ జనరల్ బాడీ సదస్సు కరపత్రాల ఆవిష్కరణ

- భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికై సదస్సు
- కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఐఎఫ్టియు పిలుపునిచ్చారు

**టేకులపల్లి,జూలై17,ప్రజాజ్యోతి:** ఆగస్టు1వతేదీ టేకులపల్లి లో భవన నిర్మాణ ,ఇతర కార్మికుల సదస్సును నిర్వహిస్తున్నట్లు ఐఎఫ్టియు టేకులపల్లి ఏరియా కార్యదర్శి డి. ప్రసాద్ గురువారం పెట్రాంచేలకలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు.భవన నిర్మాణ, ఇతర కార్మికుల జనరల్ బాడీని జయప్రదం చేయాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను పెట్రాంచేలకలో కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏరియా కార్యదర్శి మాట్లాడుతూ భవన నిర్మాణ, ఇతర కార్మికులుకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి పటిష్టంగా అమలు చేయాలని వారికి తొమ్మిది వేల పింఛన్ అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ, ఇతర కార్మికులకు లేబర్ కార్డులు ఇవ్వడంలో లేబర్ అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి అర్హత కలిగిన ప్రతి కార్మికులకు లేబర్ కార్డు మంజూరు చేయాలని వారు కోరారు.భవన నిర్మాణ కార్మికులకు చట్టబద్ధహక్కులు సౌకర్యాలు కల్పించాలని వారు కోరారు. కార్మికులకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.కార్మిక సమస్యల పరిష్కారం కోసం కార్మికులు ఐక్యంగా నిలబడాలని వారు పిలుపునిచ్చారు. కార్మికులు ఐక్యంగా ఉద్యమించినప్పుడే కార్మిక సమస్యలు పరిష్కరించబడతాయని వారు అన్నారు. ఆగస్టు 1వ తేదీ జరిగే భవన నిర్మాణ, ఇతర నిర్మాణ కార్మిక సదస్సును భవన ఇతర నిర్మాణ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ ఇతర కార్మికులు ఈసం కార్తీక్. భద్రయ్య .లక్ష్మీనరసు, ముచ్చరాజు పెనక సత్య నారాయణ. రవి తదితరులు పాల్గొన్నారు.

